


ఖరీఫ్ ఎరువులు సిద్ధం





- సప్లయ్ కోసం అన్ని సొసైటీలకు లైసెన్సులు జారీ
- ప్రతి గ్రామంలోనూ అందుబాటులో ఎరువులు: మార్క్‌ఫెడ్ డీఎం రాజు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, 45 డీసీఎంఎస్ కేంద్రాలు ఉన్నాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు పూర్తి స్థాయిలో ఎరువులను సప్లయ్ చేశారు. మార్క్‌ఫెడ్ సంస్థ 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు లైసెన్స్‌లను జారీ చేసింది. బ్యాంకు గ్యారెంటీలను కూడా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందించింది. దీంతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని రైతులంతా తమకు అవసరమైన ఎరువులను ఏ మాత్రం ఇబ్బంది లేకుండా తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాలకు ఎరువుల సప్లయ్‌ను పూర్తిగా తగ్గించేశారు. ఆర్‌బీకేలకు ఎరువులను అందిస్తున్నామని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పుకోవడం తప్పితే.. ఏ ఆర్‌బీకే కేంద్రాలకు పూర్తిస్థాయిలో ఎరువులను అందించలేకపోయారు. ఆర్‌బీకే కేంద్రాల్లో సిబ్బంది కూర్చొనేందుకు కూడా స్థలం లేని పరిస్థితుల్లో ఎరువులను తెచ్చి ఎక్కడ నిల్వ చేయాలో ఆ కేంద్రాల సిబ్బందికి దిక్కు తెలియడం లేదు.

గత వైసీపీ ప్రభుత్వంలో రూ. కోట్లు ఖర్చు పెట్టి ఆర్‌బీకే భవనాలను ఏర్పాటు చేశారు. కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. అయితే రైతులకు అవసరమైన ఎరువులను మాత్రం సప్లయ్ చేయలేకపోయారు. దీంతో రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించక తప్పలేదు. ఏటా ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో వివిధ కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ యూరియా దాదాపు మూడున్నర లక్షల మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. ఈ ఎరువులను రైతులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చే బాధ్యత మార్క్‌ఫెడ్ సంస్థ చూసుకుంటోంది.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులను పూర్తి స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్‌ల ద్వారా రైతులకు అందించాలని ఆదేశాలు జారీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎరువుల కొరత రానీయం

గ్రామాల్లో రైతులకు సరిపడ అన్ని రకాల ఎరువులను మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా వచ్చే ఖరీఫ్‌కు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సహకార బ్యాంక్ గ్యారెంటీ అందిస్తోంది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులకు కొరత లేదు. ఎంఆర్‌పీ ధరకే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాల్లో ఎరువులను రైతులకు అందుబాటులోకి ఉంచుతున్నాం. - రాజు, మార్క్‌ఫెడ్ కర్నూలు మేనేజర్

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్ ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి 75వ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఫరూక్‌తో పాటు మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. భారత దేశ చరిత్రలో ముందు చూపు గల్గిన పాలన అందించడంలో తమనాయకుడు ముందుంటారని కొనియాడారు. ఆయన రాజకీయ ప్రస్థానం ఎంతో గొప్పదని అన్నారు. రాష్ట్రంలో మంచి పాలన అందించడానికి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ తనదైన ముద్ర వేశారన్నారు. ఆయన పాలనలో రాష్ట్ర ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. బాబు పాలన విధానం రాబోమే నాయకులకు ఎంతో ఆదర్శమన్నారు. పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పరివర్తన లైఫ్ సెంటర్ అన్నదానం, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్, వార్డు, ఇన్‌చార్జిలు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, నాయకులు

చంద్రబాబు పాలన ఆదర్శం

- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి కృషి
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు
- ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్డు పంపిణీ

బనగానపల్లె, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలన ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో సీఎం చంద్రబాబునాయుడు 75వ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేసి వేడుకలను నిర్వహించారు. అనంతరం బనగానపల్లె ఏరియా ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ చంద్రబాబుకు సంపూర్ణ ఆయుష్షు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరారు. కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవడంతో ప్రధాన పాత్ర పోషించారన్నారు. వైసీపీ పరిపాలనలో గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకురావడానికి కృషి చేస్తున్నారన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని బాగుపరచడానికి అహర్నిశలు కృషిచేస్తున్నారన్నారు. మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణా రెడ్డి, ఎస్సార్బీసీ ప్రాజెక్టు చైర్మన్ జిల్లెళ్ల రాజశేఖర్‌రెడ్డి, శంకర్ రెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, కాట్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ బురానుద్దీన్, కాశీంబాషా, సలాం, అల్తాఫ్‌హుసేన్, నియాజ్ అహమ్మద్, పూలకలాం, సర్పంచ్‌లు మహేశ్వరరెడ్డి, తులసిరెడ్డి, భూషన్న, షేక్షావలి, దస్తగిరి, తిరుమలయ్య, శంకర్, గాలిమధు సూదన్‌రెడ్డి, సూపరింటెండెంట్ సుజాత, ఇతర డాక్టర్లు, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అకాల వర్షం.. అపార నష్టం

జిల్లాలో అకాల వర్షం కారణంగా అపార నష్టం కలిగింది. ఆదివారం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన వాన బీభత్సం సృష్టించడంతో వరి, మొక్కజొన్న ధాన్యాలు తడిసి ముద్దయ్యాయి. పలుచోట్ల భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. కొన్ని చోట్ల రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రుద్రవరం మండలంలో వడగండ్ల వాన కురవడంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టం వాటిల్లడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు. వచ్చే పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ముందస్తుగా అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పలు ప్రాంతాల్లో రోడ్లపైనే నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పెనుగాలుల బీభత్సానికి ఆత్మకూరులోని పెద్దపీర్లవీధిలో విరిగిన చెట్టు



ముకుందాపురం సమీపంలో రహదారికి అడ్డంగా పడిన చెట్లను తొలగిస్తున్న యువకులు



రుద్రవరం మండలం చిత్తరేణిపల్లెపంట పొలాల్లో తడిచిన వరి ధాన్యం

పిడుగు పాటుకు ముగ్గురి మృతి

- కర్నూలు జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు

ఎమ్మిగనూరు రూరల్/పెద్దకడుబూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు ముగ్గురు మృతి చెందగా.. నలుగురు గాయపడ్డారు. వివరాలివీ.. పెద్దకడుబూరు మండలంలోని హనుమాపురం గ్రామానికి చెందిన గొల్ల కొత్తూరు ఈరన్న(28) భార్య గర్భిణి. సోమవారం తన భార్య ప్రసవం అవుతుందని వైద్యులు తెలపడంతో ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్లు కొండలో వెలసిన సుశీలమ్మకు పూజ చేసేందుకు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. మార్గమధ్యలో వారు నడుచుకుంటూ వస్తుండగా పిడుగు పడడంతో ఈరన్న అక్కడిక్కడే మృతిచెందాడు. నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మిగనూరు మండలం గుడికల్లు సమీపంలో పెద్దకడుబూరు మండలం హెచ్. మురవణికి చెందిన గొర్రెల కాపరి అడివన్న(50) పిడుగు పాటుకు మృతి చెందారు. పనినిమిత్తం పట్టణ సమీ పంలో ఉన్న ఓ వైన్ షాప్ దగ్గర వచ్చిన సమయంలో పిడుగుపడినట్లు స్థానికులు తెలిపారు. ఎమ్మిగనూరు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఈరన్న (ఫైల్) అడివన్న మృతదేహం

చిప్పగిరి: చిప్పగిరిలోని ఉల్లిగమ్మ దేవాలయం వెనక పిడుగు పడటంతో రైల్వే విశ్రాంత ఉద్యోగి శివన్న మృతి చెందారు. పశువులకు మేతవేయడానికి వెళ్లిన పశువులపాకలో ఉన్నారు. ఆ సమయంలో పిడుగు చెట్టుపై పడడంతో కొమ్మ విరిగి పడి అక్కడికక్కడే మృతి చెందారని స్థానికులు తెలిపారు. శివన్నకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

నిరుద్యోగులకు వరం.. మెగా డీఎస్సీ

- టెట్ పరీక్షతోనే మభ్యపెట్టిన వైసీపీ ప్రభుత్వం
- బ్యాక్‌లాగ్‌తో కలిపి ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న 2645 పోస్టులు





నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు టీడీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు ఓ వరంగా మెగా డీఎస్సీని ప్రకటించింది. టెట్ పరీక్షతోనే మభ్యపెట్టి నిరుద్యోగుల నుంచి పరీక్షా ఫీజులు వసూలు చేసి వైసీపీ ప్రభుత్వం నిండా ముంచిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏడాది పాలనలతో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ జారీచేసిన ఖ్యాతి రాష్ట్ర ప్రభుత్వం దక్కించుకుంది. ఉమ్మడి జిల్లాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులతో కలిపి 2645 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

అన్ని మేనేజ్‌మెంట్లలో రిజర్వేషన్ల వారీగా...

ఓసీ - 1057, బీసీ ఏ - 187, బీసీ బీ - 259, బీసీ సీ- 27, బీసీ డీ-186, బీసీ ఈ- 99, ఎస్సీ గ్రేడ్ 1 - 35., ఎస్సీ గ్రేడ్ 2-173, ఎస్సీ గ్రేడ్ 3- 204, ఎస్టీ - 161, ఈడబ్ల్యూఎస్ - 257

భర్తీ కానున్న పోస్టులివే..

ఎస్‌ఏ లాంగ్వేజి	-82
ఎస్‌ఏ హిందీ	-114
ఎస్‌ఏ ఇంగ్లీష్	-81
ఎస్‌ఏ గణితం	-90
ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్	-66
జీవశాస్త్రం	-74
సోషల్	-112
ఎస్‌ఏ పీఈటీ	-209
ఎస్జీటీ	-1817

నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు

డీఎస్సీలో జిల్లా లేదా జోన్‌ల వారీగా పోస్టులు కేటాయిస్తారు. ప్రతి జోన్‌కు సంబంధించి 80 పోస్టులు స్థానికులకు కేటాయిస్తారు. మిగిలిన 20 పోస్టులు నాన్‌లోకల్స్ కూడా దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుంది.

స్థానిక అభ్యర్థి ఎవరు..?

ఒక అభ్యర్థి పదేళ్లలో ఏడేళ్లు సంబంధిత జిల్లాలో లేదా జోన్ ఏరియాలో (అంటే కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు) చదువుకొని ఉండాలి. తల్లి లేదా తండ్రి సంబంధిత ఏరియాలో పదేళ్ల నుంచి నివాసం ఉంటే స్థానిక అభ్యర్థిగా పరిగణిస్తారు.

స్థానికేతర అభ్యర్థి ఎవరు..?

అభ్యర్థి దరఖాస్తు చేస్తున్న జిల్లా లేదా జోనల్ ఏరియాకు చెందిన వారు కాకపోతే వారు నాన్‌లోకల్‌గా పరిగణిస్తారు. నాన్‌లోకల్ అభ్యర్థులు 20శాతం కోటాలో మెరిట్ ఆధారంగా ఎంపిక అవుతారు. ఉదాహరణకు.. ఒక మండలంలో 100 పోస్టులు ఉన్నాయి అనుకోండి. అందులో 80 పోస్టులు లోకల్ అభ్యర్థులకు, 20 పోస్టులు నాన్‌లోకల్‌కు కేటాయిస్తారు. ఇందులో నాన్‌లోకల్ అభ్యర్థులు ఎంపిక కావాలంటే వారికి మరియు లోకల్ అభ్యర్థులకు మధ్య మంచి మెరిట్ ఉండాలి.

డీఎస్సీ షెడ్యూల్ ఇలా...

- ఆనల్‌లైన్ ద్వారా ఫీజుల చెల్లింపులు, దరఖాస్తుల స్వీకరణ
  - ఈనెల 20వతేదీ నుంచి మే 15వరకు
- మాక్‌టెస్ట్ - మే 20 నుంచి
- హాల్‌టిక్కెట్‌ల డౌన్‌లోడ్ తేదీ - మే 30వతేదీ నుంచి
- ఏపీ డీఎస్సీ పరీక్షలు
  - జూన్ 6వ తేదీ నుంచి జులై 6వ తేదీ వరకు
- ప్రాథమిక కీ విడుదల
  - అన్ని పరీక్షలు పూర్తయిన రెండవ రోజు

అటవీశాఖలో రూ.19.25 లక్షలు స్వాహా

- ఆడిటింగ్‌లో బయటపడ్డ అవకతవకలు
- విశ్రాంత అధికారిపై కేసు నమోదు
- ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా వెల్లడి
- సొమ్ము రికవరీకి ప్రయత్నాలు



ఆత్మకూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో ఓఇంటి దొంగ వ్యవహారం అటవీ శాఖలో దుమారం రేపుతోంది. సదరు అధికారి అవకతవకలకు పాల్పడి సుమారు రూ.19.25 లక్షల నగదును స్వాహా చేశాడు. ఈ అక్రమాలపై విచారణ చేపట్టగా పలు వాస్తవాలు వెలుగుచూశాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ వీ.సాయిబాబా ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఆత్మకూరు మండలంలోని బైర్లూటి చెక్‌పోస్టు సంబంధించి పర్యావరణ రుసుము పేరిట వసూళ్లు చేసిన మొత్తాన్ని తొలుత ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ పేరిట బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. నెల పూర్తయిన ఆతర్వాత ఆమొత్తాన్ని ఆర్టీజీఎస్ ద్వారా ఆంధ్రప్రదేశ్ టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (ఏపీటీసీఎఫ్)కు బదలాయింపు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే 2024 మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి 8చెక్కులను ఏపీటీసీఎఫ్ పేరిట నంద్యాల ఎఫ్‌డీపీటీకి జమ చేయాల్సిఉండగా అందులో రెండు చెక్కులను గతంలో ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ పరిధిలో అకౌంట్స్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న చాంద్‌బాషా నంద్యాల ఎఫ్‌డీపీటీ పేరిట ఉన్న ఆంధ్రప్రగతి బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉండగా అందులో రూ.1,85,793, రూ.17,40,200 విలువ గల రెండు చెక్కులను తమ బంధువులకు సంబంధించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలకు ఆర్టీజీఎస్ ద్వారా పంపించి ఆ సొమ్మును స్వాహాచేశారు. ఉన్నతాధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. చాంద్‌బాషా 2024 జూలై ఉద్యోగ విరమణ పొందారు. ఆతర్వాతపై ఇతనిపై అటవీశాఖ ఉన్నతాధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. అటవీ ఉద్యోగుల ఈపీఎఫ్ కూడా సక్రమంగా చెల్లించలేదన్న ఆరోపణలతో పాటు చెక్‌పోస్టుల వద్ద వసూళ్లయ్యే పర్యావరణ రుసుం చెల్లింపుల్లో కూడా అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు అధికారుల దృష్టికి వచ్చాయి. ఇందుకు స్పందించిన అటవీశాఖ ఉన్నతాధికారులు ఈఅక్రమాలపై విచారణ చేపట్టాలని శ్రీశైలం సబ్ డీఎఫ్‌ఓ అబ్దుల్ రవూఫ్ ఐఎఫ్‌ఎస్‌ను నియమించారు. దీనిపై గడిచిన నాలుగేళ్లకు సంబంధించిన ఆత్మకూరు అటవీశాఖ పరిధిలోని ఆర్థిక లావాదేవీలను ఆడిటింగ్ చేయగా ఏఏవో చాంద్‌బాషా చేసిన అవకతవకలు వెలుగుచూశాయి. అంతేకాదు రెండు చెక్కుల్లో ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ వి.సాయిబాబా సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసినట్లు తెలిసింది. చెక్కులు రాసే క్రమంలో ఏపీటీసీఎఫ్ అని పేరు రాసినప్పటికీ నగదు బదలాయింపు చేయా ల్సిన అసలు బ్యాంకు ఖాతా నంబర్ కాకుండా తన బంధువుల ఖాతా నంబర్లను రాయించుకున్నట్లు గుర్తించారు. మొత్తానికి అవకతవకలు జరిగినట్లు గుర్తించి అటవీ శాఖాధికారులు ఈ వ్యవహారంపై ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చాంద్‌బాషాపై కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా వెల్లడించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు. ఇదిలావుంటే రూ.19,25,993 విలువగల రెండు చెక్కులను దారిమళ్లించడం వెనక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ కార్యాలయానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు యూనియన్ బ్యాంకు ఆత్మకూరు బ్రాంచ్ ద్వారా జరుగుతున్నాయి. ఏపీటీసీఎఫ్ - నంద్యాల ఎఫ్‌డీపీటీ బ్యాంకు ఖాతా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఉన్నట్లు తెలిసింది. చెక్కుల ఆర్టీజీఎస్ బదలాయింపులో ఖాతాపేరు, అకౌంట్ నంబర్లను సరిచూసుకోకుండా యూనియన్ బ్యాంకు అధికారులు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాకు కాకుండా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలకు నగదు బదలాయింపు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. అటవీ శాఖలో ఇంటిదొంగ వ్యవహారం ఆశాఖ అధికారులకు తలనొప్పిగా మారినట్లు తెలిసింది. అతను స్వాహా చేసిన సొమ్మును ఎలాగైనా రికవరీ చేసేందుకు ఆశాఖ అధికారులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా

పేదరిక నిర్మూలనే సీఎం లక్ష్యం

● చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు


హుసేనాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్


పత్తికొండలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


మంత్రాలయం మండలం మాధవరంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, నాయకులు

పేదరికం లేని రాష్ట్రమే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని, ఆ మేరకు నిరంతం ఆయన కృషి చేస్తున్నారని ప్రజాప్రనిధులు అన్నారు. కర్నూలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం ముందుకెళ్తున్నారని అన్నారు. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


నందికొట్కూరు రూరల్: కోనిదేలలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



ఎమ్మిగనూరులో సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని బైక్‌ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ, నాయకులు


నందికొట్కూరు టీడీపీ కార్యాలయం వద్ద వృద్ధురాలితో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


డోన్: ఎంఎస్ఆర్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ధర్మవరం సుబ్బారెడ్డి


ఆలూరులో కేక్ కట్ చేస్తున్న వీరభద్రగౌడ్

క్రీడల్లో అద్వితీయ ప్రతిభ

● అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తూనే పారా క్రికెట్, పారా త్రో బాల్ పోటీల్లో రాణింపు

● ఆరేళ్లుగా ఆంధ్ర పారా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా కొనసాగుతున్న కైలాస్‌రెడ్డి


అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో సాధించిన బ్రాంజ్ మెడల్‌తో కైలాస్‌రెడ్డి

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం ఆయన ముందు చిన్నబోయింది. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన కైలాస్‌రెడ్డి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్వితీయమైన ప్రతిభ కనబరుస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్ననాటినుంచి క్రికెట్ ఆటపై ఆసక్తి ఉండటంతో దివ్యాంగుడైన కైలాస్‌రెడ్డి కఠోర శ్రమతో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికయ్యారు. తన క్రీడా ప్రస్థానంలో తండ్రితోపాటు అన్న వెంకటరెడ్డి, భార్య రాజేశ్వరి ఇచ్చిన ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయిలో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేశారు. క్రికెట్‌లో కెప్టెన్‌గా ఉత్తమ క్రీడాకారుడిగా కీర్తిప్రతిష్టలు సాధించడంతో పాటు ఇటీవల జరిగిన పారా త్రో బాల్ చాంపియన్‌షిప్‌ను భారత జట్టుకు రజత పతకాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించారు. గండా కైలాస్‌రెడ్డిది నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామం. తల్లిదండ్రులు పెద్దిరెడ్డి, వెంకటపుల్లమ్మ, అన్న వెంకటరెడ్డి. సాధారణ రైతు కుటుంబంలో జీవనం సాగిస్తున్న కైలాస్‌రెడ్డి విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ గనులు, భూగర్భశాఖలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థికంగా తన తోటి ఉద్యోగుల సహకారంతో అంచలంచెలుగా ఎదిగి భారత పారా త్రో బాల్ జట్టుకు ఎంపికయ్యారు. 2025 మార్చి 28 నుంచి 30 వరకు కాంబోడియా దేశంలో జరిగిన ఆసియా పారా త్రో బాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 8 దేశాలు పాల్గొన్న ఈ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు రజత పతకం సాధించింది.


ఇండియా జట్టుతో కైలాస్‌రెడ్డి (ఫైల్)



ఆంధ్ర జట్టు కెప్టెన్‌గా సాధించిన కప్పుతో కైలాస్‌రెడ్డి (ఫైల్)

గ్రామీణ ప్రాంతం నుంచి పారా క్రికెట్ ఆంధ్ర జట్టుకు గత ఆరేళ్ల నుంచి కెప్టెన్‌గా వ్యవహరించడమే కాకుండా త్రో బాల్ భారత జట్టుకు ఎంపిక కావడంపై పలువురు ప్రశంసిస్తున్నారు. సరైన సౌకర్యాల్లేని గ్రామం నుంచి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడం విశేషం. ఆయనకు సాయి ప్రణీత్, యశస్విని సంతానం.

క్రీడా ప్రస్థానం ఇలా..: 2012లో శ్రీలంకలో జరిగిన ట్రై సిరీస్ క్రికెట్ పోటీలకు భారతజట్టు తరఫున ప్రాతినిధ్యం. ఈ టోర్నమెంట్‌లో భారత జట్టు మూడు మ్యాచ్‌లు గెలిచి సిరీస్ కైవసం చేసుకుంది. 2014లో రెస్టాఫ్ ఇండియా క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ బరోడా, విదర్భాలలో అంతర్జాతీయ పారా క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాడు. ఈ పోటీల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ ప్లేయర్ అవార్డులు అందుకున్నారు. 2025లో కాంబోడియా దేశంలో జరిగిన మొదటి ఆసియా పారా త్రో బాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం. ఈ టోర్నీలో భారత జట్టు రజత పతకం సాధించింది.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం

క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం. బీకాం (కంప్యూటర్స్) పూర్తి చేశాను. గత 16 ఏళ్ల నుంచి అవుట్ సోర్సింగ్ కింద గనుల శాఖలో పనిచేస్తున్నా. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా 2నుంచి 3శాతానికి పెంచి క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు. ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో నేరుగా గ్రూప్-2 ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో ఉన్నా.

- కైలాస్‌రెడ్డి

అభివృద్ధిని పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లారు. ఏపీ ఫుల్ ఫామ్ అంటే కూటమి ప్రభుత్వానికి ఏ అంటే అమరావతి పీఅంటే పోలవరం కనిపిస్తుం దన్నారు. కూటమి ప్రభుత్వానికి అమరావతి, పోలవరంపైనే ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. కానీ రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో 4 వేల కోట్లు ఖర్చు చేస్తే రాష్ట్రం లోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి అవుతాయన్నారు. వైసీపీ కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పద్మశాలీయ కులానికి చెందిన విద్యార్థులకు జూన్ 1వ తేదీన ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు పద్మశాలీయ సంఘ అధ్యక్షుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం భద్రావతీ భావనాఋషి ఆలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పద్మశాలీయ సంఘం నాయకులు మాట్లాడుతూ పదో తరగతిలో 540మార్కులు, ఇంటర్‌లో 900మార్కులు పైన సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులుగా వరుసగా రూ.10000, రూ.7500, రూ.5,000, రూ.2000 అందజేస్తామన్నారు. వివరాలకు మంగపతి సెల్ నెంబర్: 939045889కు సంప్రదించాలన్నారు. ఈనెల 15లోపుల మార్క్‌లిస్టు, కులధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను అందజేయాలన్నారు.

సీఎం జన్మదిన వేడుకల్లో విషాదం

● గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి


సురేంద్ర నాయుడు(ఫైల్)

ఆలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి అటికెలగుండు సురేంద్ర నాయుడు(30) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. చంద్రబాబు జన్మదినం సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌తో కలిసి ర్యాలీలో పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. అనంతరం వాంతులు కావడంతో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, టీడీపీ యువనేత గిరి మల్లేష్, గౌడ్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెకుంఠం శివప్రసాద్, సీనియర్ నాయకులు జయ రామ్, శేషగిరి నివాళులర్పించారు. సురేంద్ర మృతి పట్ల వీరభద్ర గౌడ్ కన్నీటి పర్యంతరమయ్యాడు. టీడీపీ కార్యాలయంలో సురేంద్ర మృతి పట్ల 5 నిమిషాల మౌనం పాటించారు. సోమవారం టీడీపీ కార్యాలయం నుంచి పార్థివ దేహాన్ని ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

సొంతూరికి సేవ చేయడం అభినందనీయం

● పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

● స్కాలర్‌షిప్ చెక్కుల అందజేత


చెక్కు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉంటూ సొంతూరికి సేవ చేయడం అభినందనీయమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని ఉస్మానియా కళాశాల రోడ్డులో ఉన్న టీజీ వెంకటేష్ మైనార్టీ షాదీఖానాలో అమాన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ ఫహాద్ ఏర్పాటుచేసిన స్కాలర్‌షిప్ పంపిణీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 25 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా సొంతూరికి సేవ చేయాలన్న ఫహాద్ ఆలోచన ఎంతో గొప్పదని మంత్రి భరత్ కొనియాడారు. అయన ఈప్రాంతంలో కట్టిన బ్యానర్లు వైసీపీ నాయకులు చింపివేడయం మంచి సంప్రదాయం కాదన్నారు. పిచ్చి పనులు చేస్తే ఇది వైసీపీ ప్రభుత్వం కాదన్నారు. కర్నూలును అభివృద్ధి చేయాలన్నా ఆలోచనతో తాను ముందుకు వెళ్తున్నానని, మంచి పనులు చేస్తున్న తమను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లు గురించి లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని మంత్రి తెలిపారు. వైసీపీ నాయకులు పనిలేక రాజకీయ లబ్ధికోసం ప్రజలను రెచ్చగొట్టే పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్టేట్ హజ్ కమిటీ మెంబర్ మన్సూర్ అలీఖాన్, కార్పొరేటర్ కురువ పరమేష్, ముంతాజ్, శేషయాదవ్, జహంగీర్, మోహబూబ్ ఖాన్, జనసేన నాయకులు పవన్ పాల్గొన్నారు.

కళాకారులకు సీఎం చంద్రబాబు పెద్దపీట

● ప్రముఖ అష్టావధాని ఆముదాల మురళి

● కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో ప్రారంభమైన చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవాలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళలు, సాహిత్య రంగాలకు పెద్దపీట వేస్తూ సీఎం చంద్రబాబు కళాకారులను ప్రోత్సహిస్తున్నారని తిరుపతికి చెందిన ప్రముఖ అష్టావధాని, రాష్ట్ర ప్రభుత్వ కళారత్న పురస్కార గ్రహీత ఆముదాల మురళి అన్నారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సందర్భంగా ఏర్పాటుచేసిన 'చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవాలు' వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. ఆదివారం ఈవేడుకలను ప్రారంభించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో, ఉగాది, కందుకూరి పురస్కారాలు అందుకున్న కళాకారులు, సాహితీవేత్తలు చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి ప్రేక్షకులకు పంపిణీ చేశారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక, రాష్ట్రంలోని ఎందరో కళాకారులకు ఉగాది, కందుకూరి పురస్కారాలు ఇచ్చి, కళారంగ పురోగతికి బాటలు వేశారని చెప్పారు. రానున్న కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాటక కళాకారులకు, కళారంగానికి మరింత ప్రోత్సాహకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. మురళి మాట్లాడుతూ తాను కళారత్న అవార్డు అందుకున్న తర్వాత తొలిసారిగా కర్నూలు నగరంలో మరో కళారత్న అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ఈ మహోత్తర కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా అష్టావధాని డాక్టర్ ఆముదాల మురళిని, సాహితీవేత్తలను ఘనంగా సత్కరించారు. ఆ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా, కార్యక్రమ కన్వీనర్లు డి. ఈశ్వరయ్య, సంగా ఆంజనేయులు, వాల్మీకి రాముడు, జీవీ శ్రీనివాసరెడ్డి, పి. రాజారత్నం, గాండ్ల లక్ష్మన్న, యాగంటీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధాన కార్యక్రమం..

చంద్రబాబు నాయుడు జన్మదిన వజ్రోత్సవ వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు నిర్వహించిన అష్టావధాన కార్యక్రమం ఆహూతులను అలరింపజేసింది. ఇందులో డాక్టర్ ఆముదాల మురళి అష్టావధానిగా వ్యవహరించగా, పృచ్ఛకులుగా మారేడు రాముడు (దత్తపది), అవధా నం సుధాకరశర్మ (నిషిద్ధాక్షరి), ఎస్ఎస్ పటేల్ (సమస్య), ఇనాయ తుల్లా (అప్రస్తుత ప్రసంగం), పసుపులేటి నీలిమ (వర్ణన), డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని (ఆశువు), మధుసూదనాచారి (నెస్తాక్షరి)లతో అష్టావధానిని ప్రశ్నల వర్షం సంధించారు. పృచ్ఛకుల ప్రశ్నలకు అలవోలకగా సమాధానాలు ఇస్తూ, సభలో ఛలోక్తులతో రంజింపజేస్తూ అవధాన కార్యక్రమం కొనసాగింది.

నేడు జగదేక సుందరి సామా పద్య నాటక ప్రదర్శన...

టీజీవీ కళాక్షేత్రంలో వారం రోజుల సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు 'జగదేక సుందరి సామా' పౌరాణిక పద్య నాటకం ప్రదర్శిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. దివంగత నాటక రచయిత పల్లేటి కులశేఖర్, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య సంయుక్తంగా రాసిన ఈ నాటకానికి పత్తి ఓబులయ్యకుయ దర్శకత్వం మహించారు. నాటక ప్రదర్శనకు కన్వీనర్‌గా జీవీ శ్రీనివాసరెడ్డి వ్యవహరిస్తారు.


చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు


టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాకారులతో సత్కారం పొందిన సాహితీవేత్తలు

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా నంద్యాల సేవా ప్రగతి, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ వాకా శివశంకర్ నేతృత్వంలో ఈ ఉచిత మినరల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి రోగులు ఆస్పత్రికి వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చేవిధంగా మినరల్ ప్లాంట్ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, గుడ్లు మంత్రి ఫరూక్ , ఎన్ఎండి ఫిరోజ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి, డా.రవికృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

లాడ్జిల్లో పోలీసుల తనిఖీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాలమేరకు ఆదివారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా లాడ్జిలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా లాడ్జిల్లో బసచేస్తున్న వారి వివరాలు అడిగి లాడ్జిల్లోని రికార్డుల ఆధారంగా సరిపోల్చుకున్నారు. లాడ్జీల్లోని ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీచేశారు. లాడ్జిల పరిసరాలు క్షుణ్ణంగా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించారు. లాడ్జిల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న అనుమానం ఉంటే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. అనుమానం ఉన్న వారి వివరాలను నమోదు చేసుకొని వారిని క్షుణ్ణంగా విచారించినట్లు పోలీసులు తెలిపారు.

రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా

నంద్యాల క్రైం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం పోలీసులు రౌడీషీటర్లు, నేరచరిత్రగలవారికి పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. రౌడీషీట్లు కలిగిన వ్యక్తుల ప్రవర్తన, వారు నిర్వహించే పనులు, వారి జీవన విధానాన్ని గమనిస్తూ ఉంటామని పేర్కొన్నారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తి విడనాడాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీసుల సూచనలు బేఖాతర్ చేస్తేచర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

మిడుతూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూటి గ్రామంలో వరసిద్ధి వినాయక వీరాంజనేయ స్వామి, లక్ష్మి చెన్నకేశవ స్వామి ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం గ్రామస్తులు నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, టీడీపీ నాయకులు సంపంగి రవీంద్ర బాబు, రమణ రెడ్డి, బాబు సాహేబ్, సర్వోత్తమరెడ్డి, షబ్బు బాషా, శ్రీనివాసరెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణపై అవగాహన

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు వక్ఫ్ (సవరణ)2025 సారాంశం వివరణ సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. కోకన్వీనర్ సుధాకర్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు పటిష్ఠ పరిచే విధంగా మోదీ చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మేడామురళీధర్, కశెట్టి క్రిష్ణమూర్తి, చందిని, బీజేపీ మండల నాయకులు ఇనుగూరి రమేష్‌బాబు, కశెట్టి చంద్రశేఖర్, గురుబ్రహ్మం, మధు యాదవ్ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు శిక్షణ

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ద్వారా ఎంపికైన నంద్యాల జిల్లా హజ్ యాత్రికులకు చివరి విడత శిక్షణా తరగతులు నేషనల్ పీజీ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. హజ్ యాత్ర ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు పాటించాల్సిన విధివిధానాలు, ప్రార్థనల గురించి జిల్లా హజ్ సేవాసమితి అధ్యక్షులు డాక్టర్ ఇంతియాజ్‌అహ్మద్ వివరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ నుంచి హజ్‌యాత్రకు తొలివిమానం బయలుదేరుతుందని, శిక్షణా తరగతుల్లో చెప్పిన ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పాటించి ఎలాంటి ఆటంకాలు లేకుండా హజ్‌యాత్రను పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో జవాద్‌అహ్మద్, అజీజ్, రఫీక్‌అహ్మద్ పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

● శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం హైదరాబాదుకు చెందిన వేదబోట్ల అశ్రిత బృందంచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయక కౌత్వం, శివలీలలు, అఖిలాండేశ్వరి, శంభో శివశంభో, శివాష్టకం తదితర గీతాలకు కె. ప్రణవ, ఎ. సమన్వి, షణ్ముఖీ, వేదాంతి, లాస్య తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

నంద్యాల టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల పట్టణం ఎస్బీవో కాలనీ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై జలీల్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు మేరకు చనిపోయిన వ్యక్తి కి (65) ఏళ్లు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రలేఖన పోటీల్లో పతకాలు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని డ్రీమ్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో నంద్యాలకు చెందిన కోటేష్ ఆర్ట్ అకాడమీ విద్యార్థులు తమ ప్రతిభతో పతకాల పంట పండించినట్లు నిర్వాహకులు చింతలపల్లె కోటేష్ తెలిపారు. ఈనెల 5న విజయవాడలో జాతీయస్థాయి చిత్రకళా ప్రదర్శన, పోటీలకు నంద్యాలకు చెందిన కోటేష్ ఆర్ట్ అకాడమీకి చెందిన 28మంది విద్యార్థులు వేసిన చిత్రాలు పోటీలకు పంపగా అందులో 16మంది చిన్నారులు పతకాలు సాధించారు. అందులో 8మంది బంగారు, 8మంది రజత పతకాలు సాధించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు ఆదివారం అకాడమీలో అభినందన సభ ఏర్పాటుచేసి విజేతలకు పసిడి, రజతపతకాలతో పాటు సర్టిఫికెట్స్ కోటేష్ అందజేశారు. సాహిత్, మృదుల, రాగవైష్ణవి, శ్రేష్ఠ, లాస్యశ్రీ, సాయిహవీస్, జోషిక, దిబంకుర్‌లకు పసిడి, భానుతేజ, హర్షిత, కాత్యాయిని, శాన్విఅనన్య, నీతూకృష్ణశ్రీ, బాదుల్లాసాయి, లక్ష్యసాయి, చరిత్ రజిత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ చిన్నారులు పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు.



నంద్యాలలో కేక్ కట్ చేస్తున్న మంత్రి ఫరూక్



చిన్నారి ఆరోగ్యం పరీక్షిస్తున్న ఎంపీ శబరి



చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నందికొట్కూరు ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

అభివృద్ధికి మార్గదర్శకులు చంద్రబాబు

సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ వాకా శివశంకర్‌యాదవ్, వాకా వరప్రసాద్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కార్యక్రమంలో పాల్గొని అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆశాజ్యోతి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారానే సాధ్యమన్నారు. నంద్యాల ప్రజల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నందికొట్కూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి కొణిదేల గ్రామంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, దంపతులు ఇద్దరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఉచిత వైద్యం చేశారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ఓ వృద్ధురాలితో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ 4 పర్యాయాలు ముఖ్యమంత్రి అయిన ఘనత దేశంలో చంద్రబాబుకే దక్కుతోందన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, నందికొట్కూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, టీడీపీ నాయకులు ముర్తుజావళి, షకీల్ అహ్మద్, లాయర్ జాకీర్, వేణుగోపాల్, ఆయిల్ రవి, కృష్ణారెడ్డి తదితర నాయకులు ఒకరికొకరు కేక్ తినిపించుకున్నారు.

● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కాకరవాడ చిన్నవెంకటస్వామి పట్టణంలోని సూర్యనారాయణ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా మండలం కొణిదేల గ్రామంలో నంద్యా పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఆరుగ్రామాల పరిధిలోని వారికి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆమె భర్త శివచరణ్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, మాజీ జెడ్‌పీటీసి నాగేశ్వరరావు, కట్టుబడి శ్రీనివాసులు, పుల్లయ్యచౌదరి, శివన్న, తెలుగు యువత నాయకులు నాగన్న, నాగరాజు, బీజేపీ నాయకులు దామోదరెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను టీడీపీ మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, మాజీ అధ్యక్షుడు చెల్లె హరినాధరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పాములపాడులోని టీడీపీ నాయకులు జియం రవికుమార్ ఇంటివద్ద మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు గోవిందు, వెంకటేశ్వరరావు, ఆదిరెడ్డి, లింగేశ్‌గౌడ్, లింగస్వామి, పూసలక్రిష్ణ, సురేశ్, స్వాములు, మల్లీశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మధు, ఏసేపు పాల్గొన్నారు

బండిఆత్మకూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఎం చిత్రాలకు క్షీరాభిషేకాలు చేసి స్వీట్లు పంపిణీ చేశారు. డాక్టర్ చిటిబొట్ల భరధ్వాజశర్మ, కె చిన్నలింగారెడ్డి, షఫీ, సద్దాం, రామచంద్రుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

గోస్పాడు: గ్రామాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పలు గ్రామాల్లో చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనర్ తులసీశ్వర్‌రెడ్డి, భూమా హుస్సేని, శీలం భాస్కర్‌రెడ్డి, భాస్కర్,ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో ఆదివారం సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక గౌడ్ సెంటర్ నందు మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు యుగంధర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, నాగకృష్ణయ్య, సుబ్బయ్య, రామ్మూర్తి, మోహన్, గౌస్‌ఆజం, మన్సూర్, టపాల్ అష్రఫ్‌అలి, రామనర్సయ్య, అలిహుసేన్ ఉన్నారు.

మహానంది: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75 వ జన్మదిన వేడుకలను మహానంది మండలంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం మండల టీడీపీ నాయకులు మహానంది ఆలయ ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో టీడీపీ మహిళా నాయకురాలు ఉమాదేవి, సాయిలక్ష్మి, సరోజమ్మ, గంగిశెట్టి మల్లికార్జున, లక్ష్మినారాయణ యాదవ్, సుదర్శనంరెడ్డి,రాజులు భారీ కేక్‌ను కట్ చేశారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్త, కెసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. మసీదుపురంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పాణ్యం: మండలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75 వజన్మదిన వేడుకలను ఆదివారం టీడీపీ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాణ్యంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు కేకు కోసి పంచుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయరామిరెడ్డి, రాంమోహన్‌నాయుడు, రమణమూర్తి, ఖాదర్ బాష, ప్రభాకర్, ఎంపీటీసి రంగరమేష్, అమరసింహారెడ్డి, గోరుకల్లు రవి, శ్రీనివాసరెడ్డి, కృష్ణ, సుభాన్, సుబ్బయ్య పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాణ్యం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో దుర్వేసి గ్రామంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. మండల కేంద్రంలో టీడీపీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి గడివేముల ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

నంద్యాల కల్చరల్: నంద్యాల హోలీక్రాస్ కెథడ్రిల్ చర్చిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం మాజీ కౌన్సిలర్ కృపాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు, ఫాదర్‌లు సీఫెన్, కొత్తమాసి జోసఫ్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: నంద్యాల మార్కెట్‌యార్డు కార్యాలయంలో టీడీపీ నాయకులు, కాబోయే మార్కెట్‌యార్డు ఛైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు, కొత్తపల్లి, తదితర గ్రామాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం వేడుకలు టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఎదురుపాడు గ్రామంలో ఆ పార్టీ మాజీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, కొత్తపల్లి బస్టాండు సెంటరులో టీడీపీ నాయకులు నాగేశ్వర యాదవ్, అమర్‌తో పాటు ఆ పార్టీ నాయకులు టీడీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, మల్లారెడ్డి, కామేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సున్నిపెంట: ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొదట సాక్షిగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీశైలం ఇన్‌చార్జి ఉండవల్లి శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కే.వి రమణ చంద్రబాబు పేరున శ్రీమల్లికార్జున స్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, శ్రీభ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. సున్నిపెంటలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమల్లి సబ్బారావు, మల్లేష్, ఉమామహేశ్వరరావు, షైలా శ్రీను,జంకే సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూరులో కేక్ తినిపించుకుంటున్న నాయకులు



పాములపాడులో...



బండిఆత్మకూరు: జి.లింగాపురంలో ..



మహానందిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



పాణ్యంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



గోస్పాడు: పసురుపాడులో..



గడివేముల: దుర్వేసి గ్రామంలో..



కొత్తపల్లి: ఎదురుపాడులో...



నంద్యాల: కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు గుంటుపల్లిహరిబాబు



శ్రీశైలంలో కొబ్బరికాయలు సమర్పిస్తున్న నాయకులు



వెలుగోడులో..

ఆత్మకూరులో భారీ వర్షం

ఆత్మకూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు విపరీతంగా ఎండ ఉన్నప్పటికీ ఆతర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో పాటు ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం గంటల నుంచి సుమారు 45నిమిషాల పాటు ఏకధాటిగా వర్షం కురియడంతో పట్టణంలోని పలు కాలనీల్లో వర్షపునీరు నిలిచింది. అదేవిధంగా పట్టణంలోని పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి.



భారీ వర్షంతో ఆత్మకూరులోని అర్చన్‌కాలనీలో నిలిచిన వర్షపునీరు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): క్రీస్తు ప్రభువు చూపిన మార్గంలో మానవాళి అందరూ శాంతియతంగా జీవించాలని ఆర్సీఎం చర్చి మతగురువు ప్రసన్నకుమార్ సూచించారు. క్రీస్తు పుట్టిన రోజు అయిన క్రిస్మస్ తర్వాత, అంతటి ప్రాముఖ్యత కలిగిన రోజుగా 'ఈస్టర్' భావించాలని సందేశమిచ్చారు. ఆదివారం నంద్యాల ఆర్సీ ఎం చర్చిలో క్రైస్తవులు క్రీస్తు ప్రభువు సమాధి నుంచి పునరుత్థానమై లేచిన వేడుక 'ఈస్టర్'ను ఘనంగా నిర్వహించుకున్నారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రీస్తు పునరుత్థాన వేడుకలు క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చర్చిలలో ప్రత్యేక ఈస్టర్ ప్రార్థనలు, ఆరాధనలను నిర్వహించారు. యువకులు ఒకరిపై ఒక రు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు.

ఆత్మకూరు: ఆత్మకూరులోని ఇందిరానగర్, ఎస్బీజీపాలెం, ఎబీఎంపాలెం తదితర చర్చీలతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లోని అన్ని చర్చీల్లో ఉదయం నుంచే ఆయా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



విద్యుత్ దీపాలతో క్రైస్తవులు





గడివేముల, ఆత్మకూరులో రంగులు చల్లుకుంటున్న యువత

మహానందిలో ఐఏఎస్ అధికారి పూజలు

మహానంది, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆదివారం వెస్ట్ బెంగాల్ ఐఏఎస్ అధికారి కిషోర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో ఐఏఎస్ అధికారి స్వామిఅమ్మవార్లకు అభిషేకార్చన పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి

పాణ్యం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన సిద్దిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి (77) సేవలు మరువలేనివని నంద్యాల విద్యుత్ శాఖ ఏఈ రామయ్య పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజామున మృతిచెందిన వెంకటసుబ్బారెడ్డి భౌతికకాయానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు.

విశ్రాంత వీఆర్వో సుబ్బారెడ్డి మృతి

పాణ్యం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండజూటూరుకు చెందిన విశ్రాంత వీఆర్వో సద్దల సుబ్బారెడ్డి (75) ఆదివారం మృతి చెందారు. సుబ్బారెడ్డి మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే కాటసానిరాంభూపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు.

మోమిన్ జిలానీ సేవలు చిరస్మరణీయం

ఆత్మకూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి దివంగత మాజీ సర్పంచ్ మోమిన్ జిలానీ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన తనయుడు మునీర్‌బాష, కౌన్సిలర్ మోమిన్ గౌస్‌ఆజం, కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రషీద్, హుసేన్ సాహెబ్ అంజుమన్ కమిటీ అధ్యక్షులు మోమిన్ ఖలీలుల్లా పేర్కొన్నారు. ఆదివారం మోమిన్ జిలానీ 15వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామ శివార్లలోని ఎస్ఆర్‌బీసీ మానవతా వృద్ధాశ్రమంలో వృద్ధులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోమిన్ హుసేన్, అసతుల్లా, ఖయ్యుద్దీన్, లాలు, నబిసాహేబ్, ఖలీముల్లా తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి: బీసీ


ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో ఏరియా ఆస్పత్రిని మంత్రి పరిశీలించారు. మహిళల వార్డులో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతను రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వైద్యానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని, మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఉపసర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ నాయకులు, డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బెస్త కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని బెస్త సంఘం నాయకులు మంత్రి బీసీకి వినతిపత్రం అందజేశారు. ఏపీ బెస్త సంఘం రాయలసీమ అధ్యక్షుడు గగ్గెర వెంకటరమణయ్య నంద్యాల జిల్లా అధ్యక్షుడు వైవి. వెంకటసుబ్బయ్య, సంఘం నాయకులు పాల్గొన్నారు. శ్రీశైలంలో భవసార క్షత్రీయులకు అన్నదాన సత్రానికి స్థలం కేటాయించాలని ఆ సంఘం నాయకులు మంత్రి బీసీకి వినతిపత్రం సమర్పించారు.

మద్దిలేటి స్వామి సన్నిధిలో మంత్రి బీసీ

బేతంచెర్ల : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలుచేశారు. ఈవో రామాంజనేయులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో ఉండాలని మంత్రి బీసీ పూజలు చేశారు.

బిజ్జం సత్యంరెడ్డికి నివాళి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సత్యంరెడ్డి కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు సత్యంరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. సత్యంరెడ్డి చిత్రపటానికి బిజ్జం సురేంద్రనాథ్‌రెడ్డి, మారం రెడ్డి భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుబ్బయ్య, గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మల్లారెడ్డి, నారాయణ, మురళీ ఆచారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

డోన్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థి డి.అసీర్ 903/1000 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. ఆదివారం డోన్ ఫార్మసిస్టు అసోసియేషన్ ఇన్‌చార్జి డీవీ రంగయ్య ఆధ్వర్యంలో విద్యార్థిని సన్మానించి ప్రోత్సాహక నగదును అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి గౌరవాధ్యక్షులు జగన్మోహన్, డా.సురేష్‌బాబు, కెమిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంటు ఆర్.రవి, కెనరా బ్యాంకు మేనేజర్ శ్రావణ్, సేవా సమితి సభ్యులు కుళ్లాయప్ప, సురేంద్రబాబు, కుమార్, సునీల్ అధ్యాపకులు ధనుంజయ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

చెంచులకు జాబ్‌కార్డుల పంపిణీ

చాగలమర్రి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో ఉపాధిపనులు చేసేందుకు చెంచులకు జాబ్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు ఏపీవో ఖాసిం తెలిపారు. ఆదివారం ఐటీడీఏ జిల్లాప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు 120 మంది చెంచులకు కార్డులను అందజేశామన్నారు. ప్రతి ఒక్కరికి వందరోజుల పని దినాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐటీడీఏ అధికారి రవీంద్రనాయక్, టీడీపీ గోపాల్, వీరయ్య, ఏపీవో నరసింహాలు, టీఏ లు బాలనాయక్, వెంకటేశ్వర్లు, ఎఫ్ఏ విజయకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన అగ్ని మాపక వారోత్సవాలు

డోన్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అగ్ని మాపక వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా అగ్ని మాపక జిల్లాఅధికారి బాల్‌రాజు హాజరయ్యారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమావేశంలో డ్వాక్రా మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈఘటన మండలంలోని కనకాద్రిపల్లె గ్రామ సమీపంలోని రాఘవరాజుపల్లె మెట్ట ఆదివారం చోటుచేసుకున్నది. రేవనూరుకు చెందిన వెంకటసుబ్బారెడ్డి, సావిత్రిమ్మ మనుమరాలు జోష్యహరిణిరెడ్డి మరో ఇద్దరితో కలిసి కారులో తాడిపత్రికి వెళుతుండగా రాఘవరాజుపల్లె వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. విషయం తెలిసిన వెంటనే కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. కాగా, తీవ్ర ఒత్తిడికి గురైన చిన్నారి జోష్యహరిణిరెడ్డి(6)ని అనంతపురానికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తికి గాయాలు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మధుసూదన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

వక్ఫ్ సవరణను ఉపసంహరించుకోవాలి


డోన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు, పార్టీల నాయకులు

డోన్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణను ఉపసంహరించుకోవాలని ముస్లిం ఐక్యవేదిక, సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ముస్లిం మతపెద్దలు, సంఘం ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డు బిల్లును రద్దు చేయాలని ఈద్గా మసీదు ప్రాంతం నుంచి అమ్మ హోటల్, రైల్వేగేట్లు, పాతబస్టాండు, కంబలపాడు రోడ్డు, ఫ్లైఓవర్ మీదుగా శ్రీరామథియేటర్ మీదుగా పాతబస్టాండు సమైక్యాంధ్ర కట్ట వరకు ర్యాలీ నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింలకు ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకయ్య, అన్వర్‌బాషా, జలదుర్గం రసూల్, చిన్న రెహిమాన్, అక్బర్ బాషా, ఖాజా, డిష్ రఫీ, నాయకులు పాల్గొన్నారు. అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో ఎస్ఐలు నరేంద్రకుమార్, మధుసూదన్, నాగార్జున, రమేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు.

23న శాంతియుత ర్యాలీ

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును నిరసిస్తూ ఈనెల 23న ఆళ్లగడ్డ పట్టణంలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాలబాష తెలిపారు. ఆదివారం జాయింట్ యాక్షన్ కమిటీ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి ర్యాలీగా రెవెన్యూ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు.


రుద్రవరంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


దొర్నిపాడులో..


శిరివెళ్లలో..


కొలిమిగుండ్లలో..

చంద్రబాబుతోనే అభివృద్ధి

- రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి
- ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

డోన్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే అభివృద్ధి అని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ఎంఎస్ఆర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీచేశారు. టీడీపీ యువ నాయకులు గౌతమ్ కుమార్ రెడ్డి డోన్ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ఈ రాఘవేంద్ర, గంధం శ్రీనివాసులు, ప్రజా వైద్యశాల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అలాగే

పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ , మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, మాజీ సర్పంచ్ పెద్దకేశవయ్య గౌడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను, బ్రెడ్లను పంపిణీ చేశారు.

కోవెలకుంట్ల: పట్టణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామక్రిష్ణారెడ్డి తన ఇంటి వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు గువ్వల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆళ్లగడ్డ : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ శీలం హరికుమార్‌రెడ్డి, కౌన్సిలర్ హుస్సేన్‌బాష, కేక్ కట్ చేశారు. అలాగే స్థానిక సంతమార్కెట్ సెంటర్‌లో నాయకులు హుస్సేన్‌బాష, సయ్యద్ హకీం, సలాం, షరీఫ్, ఖలీల్ బాష కేక్ కట్ చేసి ప్రజలకు పంచారు.

రుద్రవరం : సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా రుద్రవరంలో కేక్ కట్ చేసి బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలా గురుమూర్తి, కొమ్మలపాటి రాజారావు, చంద్రశేఖర్, కాంతు, దస్తగిరి పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజా నారాయణమూర్తి, టి శ్రీనివాసులు, బత్తుల రమేష్‌రెడ్డి, రామ్మోహన్‌యాదవ్, ఖాజాపీర్, నాగేంద్ర పాల్గొన్నారు.

శిరివెళ్ల: శిరివెళ్లలో మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, ఎంపీటీసీ యామా శ్రీనివాసులు, యామా శ్రీకాంత్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. శిరివెళ్లలో టీడీపీ నాయకులు సూరా రామ, ఉల్లి వెంకట సుబ్బయ్య, కొత్తపేట జిక్రియా ఆధ్వర్యంలో, యర్రగుంట్లలో ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, శీలం లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో, కమతం పుల్లారెడ్డి, కమతం లక్ష్మీరెడ్డి, వెదుర్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీఎం పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు.

కొలిమిగుండ్ల: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి కాముకుడు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేకు కట్‌చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు అంబటి వివేకానందరెడ్డి, మూలే హుస్సేన్‌రెడ్డి, మందా విజయ్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.


డోన్‌లో ఎంఎస్ఆర్ కార్యాలయంలో కేక్ కట్ చేసిన ధర్మవరం సుబ్బారెడ్డి, కార్యకర్తలు

చాగలమర్రి: చాగలమర్రిలోని మహబూబ్ థియేటర్ ఆవరణలో ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. ముత్యాలపాడు బస్టాండ్‌లోని టీడీపీ కార్యాలయం లో నాయకులు సల్లా నాగరాజు, గుత్తి నరసింహాలు, మాబుబాష ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు.

దొర్నిపాడు: టీడీపీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను మండల టీడీపీ నాయకుడు సిద్ధిసత్యం, కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బొబ్బూరి వెంకటస్వామి, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి తాళ్లూరి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. దొర్నిపాడులోని అంకాలమ్మ గుడి ఆవరణలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు.

బేతంచెర్ల: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, మండల సమన్వయ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం బేతంచెర్ల శేషారెడ్డి సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో డా.సాగరిక ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, బాలింతలకు, రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే టీడీపీ కార్యకర్త అన్నపూర్ణ అనాథాశ్రమం చిన్నపిల్లలకు బెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

మద్దిలేటి స్వామికి ప్రత్యేక పూజలు

సీఎం చంద్రబాబు జన్మదిన సందర్భంగా మద్దిలేటి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పండితులు స్వామి అమ్మవార్లకు హారతులు ఇచ్చారు. అమ్మవారి శ్రీచక్రానికి కుంకుమార్చన చేశారు.

అవుకు: మండలంలోని జూనూతలలో సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను గ్రామ టీడీపీ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు , పీవీ. వెంకటేశ్వర్లు, శ్రీరాం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

సంజామల: టీడీపీ కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు బెలుం సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు మల్కి ఉశేన్, టోకల మద్దిలేటి, కానాల కేశవరెడ్డి, ముక్కమల్లలో మూసాని చంద్రశేఖర్‌రెడ్డి, గిద్దలూరులో బత్తుల వెంకటప్రతాప్‌రెడ్డి, మాధవ, లింగందిన్నె బాషా, ఆర్.మహ్మద్ హుసేన్, నాగేశ్వరరావు, టైలర్ జాఫర్, సుబ్బారావు, రవి పాల్గొన్నారు.


సంజామలలో..


డోన్‌లో..


కోవెలకుంట్లలో..


ఆళ్లగడ్డలో..

యేసు లోక రక్షకుడు

డోన్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యేసు ప్రభు లోకరక్షకుడని బైబిల్ మిషన్ ఏవో రెవరెండ్ డాక్టర్ బందెల రాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్ నగర్‌లో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నశించిపోతున్న సర్వ మానవాళిని రక్షించేందుకు యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారన్నారు. సిలువలో మరణించి సమాధి చేయబడి మూడోరోజు పునరుత్థానుడు అయ్యారని అన్నారు. అలాగే సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవ.సామేల్‌బాబు, రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జాన్ మద్దిలేటి, మణిరాజ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు, కోటకొండ, చిన్నకంబలూరు, నరసాపురం, యల్లావత్తుల, ఆలమూరు, నరసాపురం గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టర్ ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో పాస్టర్ జాన్ ప్రభు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉయ్యాలవాడలో సీఎస్ఐ సంస్థ పాస్టర్ జోషిబాబు, ఆర్. పాంపల్లె, సుద్ద మల్ల, రూపనగుడి, కొండాపురం గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాయలూరు, అల్లూరు, కొండుపల్లె, హరివరం, పెద్దయమ్మనూరు, సర్వాయిపల్లె, ఇంజేడు తదితర గ్రామాల్లో యువకులు, మహిళలు, చిన్నారులు రంగులు చల్లుకొని సందడి చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తిశ్రద్ధలతో ప్రార్థనల్లో పాల్గొన్నారు.


చాగలమర్రిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


డోన్ బైబిల్ మిషన్ చర్చిలో గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవులు

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేకువ జాము నుండే చర్చిల్లో క్యాండిల్స్ వెలిగించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొలిమిగుండ్ల సీఎస్ఐ చర్చి పాస్టర్ క్షదేవి భక్తులకు సందేశం ఇచ్చారు. బెలుం గ్రామంలో యువకులు రంగులు చల్లుకుంటూ ర్యాలీగా ప్రార్థనా మందిరాలకు చేరుకున్నారు.

చాగలమర్రి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. చాగలమర్రి ఎస్సీ కాలనీలో యువకులు, పిల్లలు పెద్దలు రంగులు చల్లుకొని ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ముత్యాలపాడు ,పెద్దబోధనం, మద్దురు, పెద్దవంగలి, గోడిగెనూరు. చాగల మర్రి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం, సీఎస్ఐ, మార్తోమా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సంజామల: మండలంలోని పేరుసోముల, ఆల్వకొండ, ఆకుమల్ల, కమలపురి, ముక్కమల్ల, ఎగ్గోని, సంజామల, కానాల, గిద్దలూరు, నొస్సం గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నొస్సం సీఎస్ఐ చర్చిలో పాస్టర్ విక్టర్ విజయ్‌కుమార్ ఈస్టర్ సందేశాన్ని ఇచ్చారు.

నేడు కోవెలకుంట్లకు మంత్రి బీసీ రాక

కోవెలకుంట్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణంలో సోమవారం ఉదయం నిర్వహించనున్న వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రానున్నట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద లబ్ధిదారులకు వ్యక్తిగతంగా యంత్ర పరికరాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు ఏవో తెలిపారు. ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, అధికారులు, రైతులు హాజరుకావాలన్నారు.

ధర్మప్రచారం అందరి బాధ్యత

చాగలమర్రి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ధర్మప్రచారం అందరి బాధ్యతని పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి తెలిపారు. ఆదివారం పాత శివాలయంలో ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడవాలని అన్నారు. ధ్యానం, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. హిందూవుల సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. భగవద్గీతను పఠించి ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, హిందూ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు 6వ తరగతి ప్రవేశ పరీక్ష

డోన్ టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష సోమవారం ఉంటుందని ప్రిన్సిపాల్ కే.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్, తమ ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.

గాలివాన బీభత్సం

- తడిచిన వరి, మొక్కజొన్న, పసుపు కొమ్ములు
- అపార నష్టం
- ఆందోళనలో రైతాంగం

రుద్రవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. చిత్తరేణిపల్లె, ముకుందాపురం, హరినగరం గ్రామాల పరిధిలో వడగండ్ల వాన కురిసింది. పంట పొలాల్లో, రహదారుల వెంట ఉన్న వరి ధాన్యం ఎనిమిది వేల బస్తాలు తడిచిపోయాయని రైతులు కన్నీరుపెట్టుకున్నారు. ఆలమూరు, చిత్తరేణిపల్లె ఇంకా పలు గ్రామాల్లో రెండు వేల క్వింటాళ్ల మొక్కజొన్న తడిచిపోయాయి. నరసాపురం, రుద్రవరం, తిప్పారెడ్డిపల్లె, నాగులవరం, మందలూరు, నక్కలదిన్నె, ఇంకా పలు గ్రామాల్లో నాలుగు వేల బస్తాలు షుగర్‌లెస్ వరి ధాన్యం తడిచినట్లు రైతులు తెలిపారు.


ఆలమూరులో ధాన్యం కుప్పల మధ్య నిలిచిన వర్షపు నీరు


చిత్తరేణిపల్లె సమీపంలో ప్రవహిస్తున్న కొండ వాగు


ఉయ్యాలవాడలో విరిగిన వేపచెట్టు


నరసాపురం సమీపంలో తడిచిన వరి

వెయ్యి క్వింటాళ్ల పసుపు కొమ్ములు తడిచిపోవడంతో పసుపు నాణ్యత తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు భారీ నష్టం వాటిల్లింది.

రహదార్లకు అడ్డంగా పడ్డ వృక్షాలు

మండలంలోని చిత్తరేణిపల్లె, ముకుందాపురం, మందలూరు గ్రామాల సమీపంలో రహదారులకు అడ్డంగా వృక్షాలు పడ్డాయి. రాకపోకలకు అంతరాయం కలిగింది. చిత్తరేణిపల్లె, ముకుందాపురం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చిత్తరేణిపల్లె లో వృక్షాలు విద్యుత్ వైర్లపై పడడంతో తెగిపడ్డాయి. ఆయా గ్రామాలు అంధ కారంలో ఉన్నాయి. చిత్తరేణిపల్లె సమీ పంలో కొండవాగు ప్రవహించింది.

ఉయ్యాలవాడ: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. బలమైన గాలులు వీయటంతో రూపనగుడి గ్రామంలో భారీ వేపచెట్టు విరిగి కింద పడింది. కోత దశలో ఉన్న వరి పంట నేలవాలింది. మండలంలోని ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల, కొండుపల్లె, నర్సిపల్లె తదితర గ్రామాల్లో కలాల్లో ఆరబెట్టిన మిర్చీ, ధాన్యం తడిచింది.

చాగలమర్రి: మండలంలోని కేపీ తండా, ఓజి తండా తదితర గ్రామాలలో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఆయా గ్రామాల రహదారులలో ఆరబోసిన కొర్రా, నువ్వులు తడిసి ముద్దయ్యాయి. ఈదురు గాలులతో పెద్దవంగలి గ్రామంలో మామిడి కాయలు నేలరాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షంతో విద్యుత్ సమస్య నెలకొని ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ కోతలు అధికం కావడంతో ఉక్కపోతతో అల్లాడుతున్నారు. మండలంలో పెనుగాలుల బీభత్సంతో విద్యుత్ శాఖకు రూ. 5 లక్షలు నష్టం జరిగినట్లు ఏఈ రమణ్య ఆదివారం తెలిపారు. గ్రామాల్లో విద్యుత్‌స్తంభాలు పడిపోయినట్లు తెలిపారు.


చిన్నవంగలిలో విరిగి పడ్డ విద్యుత్ స్తంభం

400 బస్తాలు ధాన్యం తడిచింది



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 400 బస్తాలు ధాన్యం తడిచిపోయింది. బస్తా రూ.1800 వంతున తీవ్రంగా నష్ట పోయా. 400 బస్తాలు పంట పొలాల్లో కుప్పలు పోయగా తడిచిపోయింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

- రామలింగం, రైతు

చేతికందిన పంట ..



కోతలు కోసి కుప్పలుగా ఉంచిన 250 బస్తాలు వరి ధాన్యం వడగండ్ల వానతో తడిచి పోయింది. చేసిన కష్టమల్లా పుడమిపాలైంది. పెట్టిన పెట్టుబడి ఎలా తీర్చాలో మరి. అకాల వర్షం నష్టాన్ని చూపించింది.

- పాములేటి, రైతు

ప్రభుత్వం ఆదుకోవాలి



అకాల వడగండ్ల వానతో నష్టపోయాం. 260 బస్తాలు వరి ధాన్యం తడిచింది. గాలి వడగండ్లవాన బీభత్సం సృష్టించడంతో ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. తీవ్రంగా నష్ట పోయా.

- ఓబులేసు, రైతు